క్లుప్తంగా

నూతన కమిటీ ఎన్నిక



బాల్దె మల్లేశం జూకంటి శ్రీశైలం

జనగామ : జనగామ పట్టణ కురుమ సంఘం నూతన కమిటీని ఆదివారం బీరప్ప స్వామి ఆలయంలో ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షుడిగా బాల్దె మల్లేశం, కార్యదర్శిగా జూకంటి శ్రీశైలం, కోశాధికారిగా కేమిడీ ఉపేందర్ ఎన్నికైనట్లు ఆ సంఘ గౌరవ అధ్యక్షుడు మోటే లింగయ్య, జిల్లా అధ్యక్షుడు కంచె రాములు ప్రకటించారు.

నేడు 'చలో కలెక్టరేట్'

బచ్చన్నపేట : సాల్వాపూర్ గ్రామ సమస్యల పరిష్కారానికి నేడు(సోమవారం) తలపెట్టిన చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బహుజన సామాజిక ఉద్యమ కారుడు బండకింది సింగారయ్య అన్నారు. గ్రామంలో విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు భూమి సేకరణ, అర్హులందరికి ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపిక, శభాష్‌గూడెనికి రోడ్డు సౌకర్యం, వట్టిపల్లి రోడ్డును పూర్తి చేయడం, కొన్నె మండల సాధన, పులిచేరు కుంటను రిజ్వాయర్ చేయడం తదితర అభివృద్ధి పనుల సాధనగా తలపెట్టిన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

చెస్ పోటీలు



జనగామ : గుడాల భూమయ్య జ్ఞాపకార్థం గుడాల ఫ్యామిలీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చెస్ చాంపియన్ షిప్ పాఠశాల స్థాయి పోటీలు గీతాంజలి పాఠశాలలో ఆదివారం నిర్వహించారు. అండర్–9,14 విద్యార్థులకు చెస్ పోటీలు నిర్వహించగా రిత్విజు, సాకేత్, విహాన్, అక్షిత్, సంజయ్, దీక్షిత్, రేవంత్, వైభవ్ కృష్ణ ఫైనల్స్‌కి అర్హత సాధించారు. గెలుపొందిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ రుగుంట శిల్ప, వినోద్, ఫౌండేషన్ ప్రతినిధులు గుడాల వేణు, శ్రీధర్ అభినందించారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన సంతోష్‌కుమార్‌ను పలువురు ప్రశంసించారు.

పల్లెలకు.. గణపయ్యలు



దేవరుప్పుల : గణపతి నవరాత్రి ఉత్సవాల కోసం వినాయక విగ్రహాలను భారీగా పల్లెలకు తరలిస్తున్నారు. ఆదివారం మండలంలోని జనగామ–సూర్యాపేట రహదారి గుండా యువకులు హైదరాబాద్ నుంచి భారీ విగ్రహాలను కొనుగోలు చేసి తీసుకు వస్తున్నారు.

అర్చకుల నిరసన



బచ్చన్నపేట : మండలంలోని కొడవటూరు సిద్దేశ్వర ఆలయ అర్చకులు చేపట్టిన నిరసన ఆదివారం నాటికి మూడో రోజుకు చేరుకుంది. అర్చకులు సంగమేశ్వర్ కుటుంబం నోటికి నల్లమాస్కులు ధరించి నిరసన తెలిపారు. తమ కుటుంబానికి చెందిన వారికి ఆలయంలో ఉద్యోగం కల్పించాలని కోరారు. ప్రభుత్వం స్పందించి విచారించి తమ కుటుంబానికి న్యాయం చేయాలన్నారు. మఠం ఓంకార్, నందీశ్వర్, చంద్రప్రకాశ్, చరణ్ కుమార్, కిషోర్, కోటేశ్వర్, సాయి, మహేష్, సంగమేశ్వర్, జగన్నాథ, లీల, రేణుక, అంబిక, అనసూయమ్మ, పాల్గొన్నారు.

బియ్యం అందజేత



పాలకుర్తి : మండలంలోని వల్మిడి గ్రామానికి చెందిన తండ రాములమ్మ అనారోగ్యంతో ఇటీవల మృతిచెందింది. కాగా, ఆదివారం అమ్మ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ యతిపతి శ్రీకాంత్ బాధిత కుటుంబానికి 25కిలోల బియ్యం, కూరగాయలు, నిత్యావసరాలు అందజేశారు. రాపాక స్వాతి–నాగరాజుల జన్మదినం సందర్భంగా విరాళం అందించారని శ్రీకాంత్ తెలిపారు.కుమారస్వామి బాధితులు ఉన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి



బచ్చన్నపేట : మండల కేంద్రానికి చెందిన రైతు పాతూరి రాజిరెడ్డికి చెందిన పాడిగేదె ఆదివారం గడ్డి మేస్తుండగా విద్యుత్ తీగలు తగలడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందింది. రూ.1.20లక్షల విలువ చేసే పాడిగేదె మృతిచెందడంతో రైతు రాజిరెడ్డి బోరున విలపించాడు. తనను ఆర్థికంగా ఆదుకోవాలని బాధితుడు రాజిరెడ్డి ప్రభుత్వాన్ని వేడుకున్నాడు.

రైల్వే స్టేషన్‌లో సమస్యల తిష్ట


రఘునాథపల్లి రైల్వే స్టేషన్

కమ్మేస్తున్న ముళ్ల కొమ్మలు
- కోతుల స్వైర విహారం
- కలగానే ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్టింగ్
- వినతులు పట్టని అధికారులు, పాలకులు


ప్లాట్‌ఫామ్ పైకి వ్యాపించిన ముళ్ల కొమ్మలు

రఘునాథపల్లి : మండల కేంద్రంలోని రైల్వే స్టేషన్‌లో కనీస వసతులు లేక ప్రయాణికులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ప్లాట్‌ఫామ్ పైకి ముళ్ల కంప చెట్లు అడ్డుగా వస్తున్నా వాటిని తొలగించడం లేదు. గుంపులుగా కోతులు సంచరిస్తుండటంతో ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు. తాగు నీరు, బెంచీలు సరిగా లేవు. ప్లాట్‌ఫామ్ పై కప్పు పూర్తి స్థాయిలో లేకపోవడంతో ప్రయాణికులు వర్షం కురిసినప్పుడు, ఎండ తీవ్రత సమయంలో ఇబ్బందులు పడుతున్నారు. మరుగుదొడ్లు నిరుపయోగంగా ఉన్నాయి. రైల్వేస్టేషన్‌లో అవతలి వైపు మాత్రమే టికెట్ కౌంటర్ ఉంది. రెండో ప్లాట్‌ఫామ్ వైపు నుంచి ప్రయాణికులు ఎక్కువగా వస్తుంటారు. ఈ ప్లాట్‌ఫామ్‌పై టికెట్ కౌంటర్ లేకపోవడంతో అవతలి వైపు వెళ్లి టికెట్లు తీసుకునేందుకు ప్రయాణికులు నానా ఇబ్బందులు పడుతున్నారు.

హాల్టింగ్‌కు నోచుకోని పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లు

చుట్టూ పక్కల మండలాలు, ఎన్నో గ్రామాలకు కేంద్ర బిందువైన రఘునాథపల్లి రైల్వే స్టేషన్‌లో పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలపడం లేదు. ఈ రైల్వే స్టేషన్‌లో గోల్కొండ, తెలంగాణ ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలిపేలా కృషి చేస్తామని నేతల హామీలు నీటి మూటలుగానే మిగిలాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. నిత్యం వందలాది మంది ప్రయాణించే ఈ స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్ల నిలుపుదల కలగానే మిగిలిపోతోంది. ఇక్కడ కాకతీయ, పుష్‌పుల్ ప్యాసింజర్ రైళ్లతో పాటు భాగ్యనగర్, కృష్ణా ఎక్స్‌ప్రెస్ రైళ్లు మాత్రమే హాల్టింగ్ ఉండడంతో దూర ప్రాంతాలకు వెళ్లే వారు జనగామ, కాజీపేట, వరంగల్‌కు వెళ్లి రైళ్లు ఎక్కాల్సి వస్తోంది. ఇదే డిమాండ్‌పై చాలాసార్లు రైల్వే ఉన్నతాధికారులు, ఎంపీలు, మంత్రులు, ఎమ్మెల్యేలకు వినతులు ఇచ్చిన అవి బుట్ట దాఖలవుతున్నాయి. గోల్కొండ, తెలంగాణ రైళ్లు నిలిపితే ఎంతో సౌకర్యంగా ఉంటుందని ప్రయాణికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. స్టేషన్‌లోని సమస్యలను పరిష్కరించి ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలిపేలా తగు చర్యలు తీసుకోవాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


నిరుపయోగంగా మరుగుదొడ్లు

ఎంపీ చొరవ చూపాలి



తెలంగాణ, గోల్కొండ ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలిచేలా వరంగల్ ఎంపీ కడియం కావ్య ప్రత్యేక చొరవ తీసుకోవాలి. ఎందరో విద్యార్థులు చదువు కోసం నిత్యం హైదరాబాద్ వెళ్తుంటారు. ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలపాలని పలు మార్లు వినతి పత్రాలు ఇచ్చినా ఫలితం లేదు. దూర ప్రాంతాలకు వెళ్లి రైళ్లు ఎక్కే బాధ తప్పాలంటే ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలపాలి. - బిర్రు మధు, రఘునాథపల్లి

ముళ్లచెట్లు తొలగించాలి



రఘునాథపల్లి రైల్వే స్టేషన్‌లో ప్లాట్‌ఫాంలపై కంప చెట్లు అడ్డుగా వస్తున్నా రైల్వే అధికారులు పట్టించుకోవడం లేదు. కోతుల గుంపులతో ప్రయాణికులకు నిత్యం ఇబ్బందులు తప్పడం లేదు. టాయిలెట్లు నిర్మించినప్పటికీ అవి వినియోగించుకునే పరిస్థితి లేకుండా తాళాలు వేసి ఉంటాయి. అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలి. - కల్పగూరి ప్రభాకర్, రఘునాథపల్లి

అధ్వానంగా రోడ్లు, డ్రెయినేజీలు


గుంతలమయమైన రోడ్డును పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

స్టేషన్‌ఘన్‌పూర్ : స్టేషన్‌ఘన్‌పూర్‌లోని రోడ్లు, డ్రెయినేజీలు అధ్వానంగా మారాయని సీపీఎం మండల కార్యదర్శి, జిల్లా కమిటీ సభ్యుడు మునిగెల రమేశ్ తెలిపారు. ఘన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని 1, 13, 16వ వార్డులను సీపీఎం నాయకులతో కలిసి ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టేషన్‌ఘన్‌పూర్ మున్సిపాలిటీగా మారినా ఏమాత్రం లాభం లేదని, పారిశుద్ధ్యం, రోడ్ల సమస్య ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్లు ఉందని ఆరోపించారు. డ్రెయినేజీ వ్యవస్థ పూర్తిగా దెబ్బతినడంతో పలు వార్డుల్లోని ఇళ్ల ఎదుట మురుగు నీరు నిలుస్తోందన్నారు. ప్రధాన రోడ్లపై గుంతలు ఏర్పడిన ఎవ్వరూ పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా సంబంధిత మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజలతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు చిలుముల భాస్కర్, భూసెట్టి రాంబాబు, అమరాజు బాబు, ఇనుగాల దామోదర్‌రెడ్డి, వారాల లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

లింగాలఘనపురం : మండలంలోని క్లైం గ్రామానికి చెందిన ముమ్మాడి బ్రహ్మం కుటుంబ సభ్యులకు రూ.1.75లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును పీఏసీఎస్ చైర్మన్ బుషిగంపల ఉపేందర్ ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రహ్మం బ్రెయిన్‌స్ట్రోక్‌తో ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతూ మృతిచెందారని, వారి వైద్య ఖర్చులకు దాదాపు రూ.10లక్షల వరకు ఖర్చు అయ్యాయన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



నర్మెట : మండల కేంద్రానికి చెందిన మడికొండ ఆండాళు అనారోగ్యంతో ఇటీవల మృతిచెందినది. కాగా, ఆదివారం ఆండాళు దశదిన కర్మ సందర్భంగా భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి, రాష్ట్ర ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి పార్టీ శ్రేణులతో కలిసి మృతురాలి కుమార్తె, రాష్ట్ర నాయకురాలు మచ్చ వరలక్ష్మితో పాటు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఎమ్మెల్యే కృషితోనే మీదికొండ అభివృద్ధి


మాట్లాడుతున్న శ్రీరాములు

స్టేషన్‌ఘన్‌పూర్ : ఎమ్మెల్యే కడియం శ్రీహరి కృషితోనే మీదికొండ గ్రామం అభివృద్ధి చెందుతోందని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు నాగరబోయిన శ్రీరాములు అన్నారు. మండలంలోని మీదికొండలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలకు అనుగుణంగా పనిచేస్తూ మీదికొండ గ్రామ సమగ్రాభివృద్ధికి ప్రత్యేక చొరవతో పని చేస్తున్నారన్నారు. గ్రామంలోని పేదలకు 36 ఇందిరమ్మ ఇళ్లు వచ్చాయని తెలిపారు. ఎన్నో ఏళ్లుగా రైతులు ఎదురుచూస్తున్న మల్లన్నగండి కుడికాల్వ పనులు రూ.29 కోట్లతో చేపట్టారని, మీదికొండ, ఇప్పగూడెం తదితర గ్రామాలకు సాగునీరు అందించే కాల్వ నిర్మాణ పనులు చేపట్టారని, త్వరలో పనులు ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. రూ.50 లక్షలతో సీసీ రోడ్లు, రూ.20 లక్షలతో యాదవ, పద్మశాలి కమ్యూనిటీ భవనాలు, రూ.12 లక్షలతో అంగన్‌వాడీ సెంటర్ నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయన్నారు. నాయకులు కేశరాజు కోటేశ్వర్, రాజాంజనేయులు, రాములు తదితరులు పాల్గొన్నారు.

సురవరం మృతి ప్రజా ఉద్యమాలకు లోటు


కంచనపల్లిలో సురవరం సుధాకర్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

రఘునాథపల్లి : సీపీఐ జాతీయ నేత సురవరం సుధాకర్‌రెడ్డి మృతి ప్రజా ఉద్యమాలకు, సీపీఐకి తీరని లోటని ఆ పార్టీ మండల కార్యదర్శి, జిల్లా కార్యవర్గ సభ్యుడు కావటి యాదగిరి అన్నారు. ఆదివారం మండలంలోని కంచనపల్లిలో సీపీఐ మండల సహాయ కార్యదర్శి కందుకూరి మల్లేశం అధ్యక్షతన సంతాప సభ నిర్వహించగా ఆయన మాట్లాడారు. సురవరం బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి ఎనలేని కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు మడికంటి సోమన్న, దామెర అబ్బయ్య, సాదం అశోక్, పసుల దానేలు, గొంగ్ల వెంకటయ్య, నాల్కపల్లి దయాకర్, గుండె సుధాకర్, ప్రవీణ్, ఏలియా, శోభన్ బాబు, లత తదితరులు పాల్గొన్నారు.

విహార యాత్రతో విద్యార్థుల్లో విజ్ఞానం


విహార యాత్రలో పాల్గొన్న జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు

బచ్చన్నపేట : విహార యాత్రతో విద్యార్థులకు వినోదంతోపాటు విజ్ఞానం లభిస్తుందని హెచ్‌ఎం వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు విజ్ఞాన విహారయాత్రలో భాగంగా హైదరాబాద్‌లోని రాష్ట్రపతి నిలయం, సచివాలయం, మ్యూజియం, ట్యాంక్‌బండ్, ఎన్టీఆర్ గార్డెన్, బుద్ధ, అంబేద్కర్ విగ్రహం, హెరిటేజ్ బంగ్లా, టాకింగ్ ట్రీ, రాతి శిల్పాలు, సంప్రదాయ బావులను తిలకించారు. యాత్రకు ఆర్థికసాయం అందించిన ఉపాధ్యాయులు శేష బట్టర్ లక్ష్మీనర్సమ్మకు సహకరించిన ఉపాధ్యాయులు పద్మజ, బాలరాజ్, కృష్ణమోహన్, మల్లారెడ్డి, నర్సింహారెడ్డి, యాదగిరి, విజయలక్ష్మి, జ్యోతిలకు విద్యార్థులు, తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

యూరియా ఇవ్వలేని స్థితిలో కాంగ్రెస్

- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు


పార్టీలో చేరిన వారితో ఎర్రబెల్లి దయాకర్‌రావు

పాలకుర్తి /పాలకుర్తి టౌన్ : రైతులకు యూరియా ఇవ్వలేని స్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని, వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆ పార్టీకి వాత పెట్టాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మండిపడ్డారు. ఆదివారం మండలంలోని దర్దేపల్లి, చీమల భాయి తండా, మంచుప్పుల, తుబ్బ తండా(ఎస్పీ) గ్రామాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు సిద్ధం యుగేందర్, తాటిశెట్టి శ్రీనివాస్, పీఏసీఎస్ డైరెక్టర్ రాంధన్, బన్సీలాల్, మోకాటి యాదగిరి, వేల్పుల సోమయ్య, బాదవత్ ప్రశాంత్, వెంకటేష్ పాటు 250 మంది కార్యకర్తలు దయాకర్‌రావు సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి గులాబీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా దయాకర్‌రావు మాట్లాడుతూ.. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం, కేసీఆర్ హయాంలో మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలలేదు, ఫించన్లు ఇస్తే పెద్ద కొడుకని అన్నారని, ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం రేంవత్‌రెడ్డిని జనం తిడుతున్నారని ఎద్దేవా చేశారు. కష్టకాలంలో కలిసి వస్తున్న కార్యకర్తలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని, పాలకుర్తి నియోజకవర్గాన్ని వదిలి ఎక్కడి పోనని, పాలకుర్తి గడ్డ.. దయన్న అడ్డా అంటూ గంభీర స్వరంతో నినదించారు. 'ఇక్కడే ఉంటా నేను ఓడిపోవడంతో మన విలువ జనాలకు తెలిసిందని' తెలిపారు. పాలకుర్తి శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయం, వల్మిడి సీతారామచంద్రస్వామి ఆలయం, బమ్మెర పోతన మందిరాలను కేసీఆర్ హయాంలో కోట్లు నిధులు తెచ్చి అభివృద్ధి చేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్, జీసీసీ మాజీ చైర్మన్ గాంధీనాయక్, పుస్కూరి శ్రీనివాస్‌రావు, మాచర్ల ఎల్లయ్య, తాడెం రవి, ఇమ్మడి ప్రకాశ్, జలగం అంజయ్య, గణపురం సురేష్, ముస్కు నాగన్న, ధరావత్ బాలు నాయక్, పాలకుర్తి రాఘవరావు, వాసు నాయక్, కారుపోతుల వేణు, కొమురయ్య, నిమ్మల అనిల్, జలగం అశోక్, గద్దం హరి, రాజు తదితరులు పాల్గొన్నారు.

'స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి'


సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

కొడకండ్ల : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను అధిక సంఖ్యలో గెలిపించి సత్తా చాటాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, ఆ పార్టీ మండల అధ్యక్షుడు సురేష్ నాయక్, మండల ఇన్‌చార్జ్ రామచంద్రయ్య కోరారు. ఆదివారం మండల కేంద్రంలోని ఓ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన పట్టణ ముఖ్య నాయకుల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని, కష్టపడి పనిచేసిన వారికి తప్పక సముచిత స్థానం దక్కుతుందని వారు పేర్కొన్నారు. కొడకండ్ల మండల అభివృద్ధికి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీరెడ్డి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని ఈ సందర్భంగా వారు తెలిపారు. నాయకులు రాజేష్ నాయక్, భిక్షపతి, రవీందర్, మధుసూదన్, యాకయ్య, యాకేష్, శ్రీవర్ధ, నాగరాజు, మోహన్, వెంకన్న, గఫూర్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయాల్సిన బాధ్యత పార్టీదే..


సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణమూర్తి

కొడకండ్ల : పాలకుర్తిలో కాంగ్రెస్ పార్టీ గెలుపునకు కృషి చేసిన నాయకులు, కార్యకర్తలకు న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తామని ఆ పార్టీ దేవరుప్పుల మండల మాజీ అధ్యక్షుడు, పీఏసీఎస్ డైరెక్టర్ పెద్ది కృష్ణమూర్తిగౌడ్ తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలోని అమరవీరుల స్థూపం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాలకుర్తిలో ప్రజలను చైతన్యం చేసేందుకు కష్టపడి పనిచేసిన వారికి న్యాయం చేయాల్సిన బాధ్యత పార్టీపై ఉందన్నారు. అనేక వ్యయ, ప్రయాసాలతో కష్టపడి పనిచేసిన వారిని ఝాన్సీరెడ్డి విస్మరిస్తున్నారని, తన గెలుపునకు పనిచేసిన వారిని కాపాడుకోవాల్సిన బాధ్యత ఎమ్మెల్యే యశస్వినిరెడ్డిపై ఉందని ఆయన వివరించారు. కొడకండ్ల, దేవరుప్పుల, పాలకుర్తి మండలాల్లోని నాయకులు, కార్యకర్తలకు న్యాయం చేయాలన్నదే తన ధ్యేయమన్నారు. త్వరలో పాలకుర్తిలో 5వేల మందితో బహిరంగ సభను నిర్వహిస్తానని ఆయన చెప్పారు. మాజీ కోఆప్షన్ సభ్యుడు నసీరుద్దీన్, మార్గం రవీందర్, తిరుమణి భిక్షం, అందె సోమయ్య, జాటోత్ రాము, భూక్యా రవీందర్, బేతోజు వెంకన్న, నర్సింగరావు, వెంకన్న, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికే పోరుబాట

తొర్రూరు: ప్రజా సమస్యల పరిష్కారానికి బీజేపీ ఆధ్వర్యంలో పోరుబాట చేపడుతున్నట్లు పార్టీ నియోజకవర్గ కన్వీనర్ పూసాల శ్రీమాన్ తెలిపారు. డివిజన్ కేంద్రంలో ఆదివారం బీజేపీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. అర్బన్ అధ్యక్షుడు పైండ్ల రాజేష్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో శ్రీమాన్ మాట్లాడారు. గ్రామాలు, మున్సిపాలిటీల్లో నెలకొన్న సమస్యలపై ఈనెల 25, 26 తేదీల్లో బీజేపీ ఆధ్వర్యంలో పోరుబాట పేరిట నియోజకవర్గ వ్యాప్తంగా పర్యటించనున్నామని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పల్లె కుమార్, నాయకులు నడిగడ్డ సందీప్, సంతోష్, గట్ల భరత్, నూకల నవీన్, గంధం రాజు, చలపతిరాజు, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

నిరుపయోగంగా వసతిగృహం

- వినియోగంలోకి తీసుకురావాలని వినతి


మల్కాపూర్‌లో నిరుపయోగంగా ఉన్న వసతి గృహం

చిల్పూరు : అన్ని వసతులు కలిగి ఉండి నిరుపయోగంగా ఉన్న వసతి గృహం పూర్తిగా శిథిలావస్థకు చేరక ముందే ప్రజా అవసరాలకు వినియోగంలోకి తీసుకు రావాలని గ్రామస్తులు కోరుతున్నారు. మండలంలోని మల్కాపూర్ గ్రామంలో 22 ఏళ్ల క్రితం ఇదే గ్రామానికి చెందిన అప్పటి సమితి ప్రెసిడెంట్ రాజేశ్వర్‌రెడ్డి నిరుపేద విద్యార్థుల వసతికి సొంత స్థలంలో విశాలమైన 11 గదులతో అన్ని సౌకర్యాలతో భవనాన్ని నిర్మించారు. అయితే విద్యార్థులు లేకపోవడంతో ఆరేళ్లుగా వసతి గృహం నిరుపయోగంగా ఉంటోంది. కాగా గ్రామ పంచాయతీ భవనం ఉన్న ఇరుకుగా ఉండడంతో అధికారులు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. శిథిలావస్థకు చేరక ముందే ప్రజా అవసరాల కోసం గ్రామ పంచాయతీకి అప్పగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పంచాయతీకి అప్పగించాలి



పెద్ద గ్రామం అయినప్పటికీ పంచాయతీ భవనం ఉరుకుగా ఉంది. ఇందుకు నిరుపయోగంగా ఉన్న వసతి గృహాన్ని గ్రామ పంచాయతీకి అప్పగించాలి. అందులో జీపీ కార్యకలాపాలతో పాటు సమావేశాలు, క్రీడాకారులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. - వెన్నం మాధవరెడ్డి, గ్రామస్తుడు

ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తా..



మల్కాపూర్‌లో గ్రామ పంచాయతీ భవనం ఇరుకుగా ఉన్నది వాస్తవమే. ఇదే గ్రామంలో విశాలమైన వసతి గృహం వాడుకలో లేదు. నిరుపయోగ హాస్టల్ భవనం విషయాన్ని ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా. - శంకర్‌నాయక్, ఎంపీడీఓ

సీనియర్ ఫొటోగ్రాఫర్‌కు సన్మానం



దేవరుప్పుల : మండలంలోని కడవెండి గ్రామానికి చెందిన సీనియర్ ఫొటోగ్రాఫర్ గుమ్మడవెల్లి సోమేష్‌ను ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన జిల్లా ఫొటోగ్రాఫర్, వీడియో గ్రాఫర్స్ వర్క్‌షాప్, నూతన జిల్లా కమిటీ ప్రమాణ స్వీకారోత్సవంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఫొటో, వీడియోగ్రాఫర్ జిల్లా అధ్యక్షుడు కామని రాము, కార్యదర్శి కొంపెల్లి భాస్కర్, ముఖ్య సలహాదారులు అమృతం ఆంజనేయులు, దేవరుప్పుల మండల అధ్యక్ష, ఉపాధ్యక్షులు ఇనుముల నాగరాజు, నల్ల సతీష్, కుటుంబ భరోసా వీరు నాయక్, నరేందర్ నాయక్, నవీన్, వెంకట్, నర్సింహ్ములు, సంతోష్, యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.